# అభివ్యక్తం

## లతిక



రెండో శనివారం. సెలవురోజు. మధ్యాహ్నం భోజనాలయేయి. అర్ధాంగి సౌందర్య కునుక్కి ఉపక్రమించింది.

నాకు మధ్యాహ్నం నిద్ర రాదు. సెలవు రోజుల్లో మధ్యాహ్నం గడవడం కష్టంగా ఉంటుంది. ఎరట్లో పని మనిషి గిన్నెలు కడుగుతున్న శబ్దం, పడగ్గదిలో ఫేను తిరుగుతున్న శబ్దం, నిద్రలో ఇటూ అటూ వొత్తిగిలేటప్పుడు సౌందర్య గాజులు సవ్వడి మినహా అంతా నిశ్శబ్దంగా వుంది. ముందు వరండాలో ఈజీ ఛెయిర్‌లో పవళించి కొత్తగా వచ్చిన నవల చదువుతున్నాను.

కథ కదలడంలేదు. సిగరెట్టు వెలిగించడానికి అగ్గిపుల్ల గీసేను మంట నిశ్చలంగా వుంది. సిగరెట్టు పొగ సరళరేఖలో మీదకి వెళ్తోంది. కదలని గాలిలో వెలిగే జ్యోతి కాంతిని బ్రహ్మా నందంతో ఎందుకు సరిపోల్చారో నాకు సిగరెట్టు సేవించి తన్మయమవడంలో అనుభవమయింది.



కళ్లు కొంచెం మూసుకుని అలా ఆలోచనలో పడ్డాను. కారు హారను వినిపించింది.

వెంకటేశ్వరరావుగారు! — ఎదురుగా వెళ్లి, విష్ చేసి, తీసుకొచ్చి, ఆయనకి పడక్కుర్చీ యిచ్చి, పక్కనున్న కుర్చీలో నేను కూర్చున్నాను. ఇవన్నీ యాంత్రికంగా జరిగేయి. మనసు మాత్రం ఆయన అసాధారణమైన రాకకి కారణాలు వెదుకుతోంది. సాయంత్రం యెలాగూ క్లబ్బులో కలుస్తాం. ఈలోగా అవసరమైతే, రమ్మని కబురు చేస్తే నేనే వెళ్లే వాణ్ణి. తనంత తను వచ్చేరంటే ఏదో రాచకార్యం వుండి వుండాలి.

కాఫీ పెట్టమని సౌందర్యతో చెప్పడానికి లోపలికి వెళ్లబోయాను. "అమ్మాయి పడుకున్నట్టుంది. డోం(ట్) డిస్టర్బ్ హర్! నీతో చాలా ముఖ్యమైన పనుండి వచ్చేను." అన్నారు ప్రారంభిస్తూ!

'చెప్పండి'' అన్నాను సిగరెట్ పేకెట్టు అందించి. "క్లబ్ ఏనివర్సరీ అనుకున్నాం కదా! సోషల్ వెల్ఫేర్ మినిష్టరుగా రొస్తున్నట్టు తెలిసింది. అంచేత ఏర్పాట్లు అవీ కాస్త ఘనంగా చేదామని... సత్యానందం, వేణుగోపాలరావుగారూ ఈ సంవత్సరం ఒకరికి విశిష్ట సేవాపతకం యిద్దామని, అది మినిష్టరుగారిచేత ప్రజెంట్ చేయిద్దామని ప్రపోజ్ చేసేరు. మనూళ్లో యిలాటిది చెయ్యడం ఇదే మొదటిసారి. ఈ గౌరవం మొదటిసారి పొందడానికి డిజర్వింగ్ ఒకే ఒక్కరు..."

'అప్పగారు' నా దృష్టిపథంలో మెదిలారు. ఆయన పేరు రామ్మూర్తిగారు. ఆయనకి నేనంటే అభిమానం, సౌందర్య అంటే ముద్దు. ఆమెను చిట్టితల్లి అని, నన్ను బాబ్జీ అని పిలుస్తారాయన. నేనీనాడు మంచి స్థితిలో జీవితం గడపడానికి ఆయన చేసిన ఉపకారాలు మరువరానివి. నాలాటి ఎందరికో ఆయన దైవసమానుడు.

"రామ్మూర్తిగారి కిద్దామని అందరం నిర్ణయించుకున్నాం. తీరా ఆయన వద్దంటున్నారు." ముగించేరు వెంకటేశ్వరరావుగారు.

"లాంఛనంగా వద్దన్నారేమో ?"

"సరిపోయింది. లాంఛనంగా కాదనడం వేరు! ఆయన నిజంగానే ఒప్పకోడంలేదు."

ఆయన కాదంటే ఒప్పించడం సమస్యే! ఆలోచనలో పడ్డాను నేను. దారినపోయే కుర్రాళ్లు కొంటెతనంగా కారు హారను ప్రయోగించేరు. సౌందర్య నిద్ర తేలిపోయింది. లేచి ఫేను కట్టేసింది.

"వెంకటేశ్వరరావుగారొచ్చేరు" లోపలికి వినిపించేలా చెప్పాను. కర్టెను తొలిగించి వరండాలోకి వచ్చింది సౌందర్య!

"నమస్కారమండీ!"

"బాగున్నావా అమ్మాయ్ ?"

"బాగున్నాను. ఇప్పుడే వస్తా నుండండి" అంటూ ఇంట్లోకి వెళ్లిందామె. వెంకటేశ్వరరావుగారు మళ్లీ చెప్పసాగేరు.

"... ఇదీ సమస్య! ఆయన కాదంటే ఆయన్ని వొప్పించడం కష్టమే ననుకో... అయినా నువ్వోసారి ట్రై చెయ్యి"

"ష్యూర్ ష్యూర్! మీరు చెప్పాలా ? ఆయనకి సన్మానమంటే, మా కంటె ఎక్కువగా యెవరూ ఆనందించరేమో!"

"అందుకే నీ కోసం వచ్చింది."

"ఎందుకు మేట్నీకా" అంటూ సౌందర్య ప్రవేశించింది ట్రేలో రెండు కాఫీ కప్పులో.

"ఇప్పు డివన్నీ ఎందుకు చేసే వమ్మాయ్ ?"

"మీకు థియేటర్లో మంచి కాఫీ దొరకదని!"

"తల్లీ! నీ మొగుణ్ణి నేను సినిమాకి తీసుకెళ్లడానికి రాలేదు. ఒకవేళ తీసుకెళ్లినా విత్యువర్ మెజస్టీస్ పర్మిషన్ ఓన్లీ."

"అయితే మరో కాఫీ యిస్తాను."

"అది మీ మేరేజేనివర్సరీకి రిజర్వు చెయ్యి. అన్నట్టు మీ పెళ్లి పండుగ ఈ నెల్లోనే కాబోలు ?"

"మీకు గుర్తుందే! మీ ముందున్న పెద్ద మనిషి నడగండి, పెళ్లయి ఎన్నాళ్లయిందో!"

"పన్నెండేళ్లుకదా!" నా సమాధానం.

"గుడ్! వివాహ పుష్కరోత్సవ మన్నమాట! అయితే ఈసారి గ్రాండ్‌గా చెయ్యాలి! ఇంతకీ ఎప్పుడట?"

"ట్వెంటీ థర్డ్‌న" వెంటనే చెప్పేను. లేకపోతే సౌందర్య దెప్పుతుంది, పెళ్లిరోజు గుర్తు లేదని!

"క్లబ్బుది పదహారు ననుకుంటున్నాం" అన్నారు వెంకటేశ్వరరావుగారు.

"ఏవిటి పెళ్లిరోజా?" జోక్ చేసింది సౌందర్య.

నవ్వులు పూర్తయ్యేక వెంకటేశ్వరరావుగారు మళ్లీ ప్రారంభించేరు "... రామ్మూర్తిగారొప్పు కుంటే, జీవిత విశేషాలు వగైరా సూవెనార్‌లో వెయ్యాలి. టైం తక్కువగా వుంది. అంచేత తొందర్లో ఆయన్ని కలుసుకుని, ఒప్పించే డ్యూటీ నీది."

"డ్యూటీ నాదేననుకోండి..."

"ఫూచీ మాత్రం కాదంటావ్..."

"ఫూచీ నాది. ఒప్పిస్తే నాకేం ప్రజెంటిస్తారు?" కలగజేసుకుంటూ అడిగింది సౌందర్య!

"సౌందర్యా! పూర్తిగా వినకుండా..."

"విన్నాను. మీ అప్పాగారికి సన్మానం ఆయన ఒప్పుకోలేదు. అంతేకదా! నే నొప్పిస్తాను."

"మా క్కావలసిందదే" అన్నారు వేంకటేశ్వర రావుగారు.

"అయితే రెండు షరతులు."

"ఆయ న్నొప్పించు. ఎన్ని షరతులైనా మేం రెడీ."

"ఒకటి, మొదట మీరడిగినప్పుడు కాదన్నారని ఆయన్ని తేలిక చేసి మాట్లాడకూడదు."

"కలలో కూడా మాట్లాడం — రెండోది?"

"ఆయన్ని వొప్పించడం కోసం నే నేదైనా ప్రోగ్రాం ప్లాన్ చేస్తే కేరీ అవుట్ చెయ్యాలి."

"బై ఆల్ మీన్స్. ఈ విషయంలో నీకు అన్ని స్వతంత్రాలూ యిచ్చేం! నువ్వేం చేసినా మా కంగీకారమే. సరేనా?"

"హార్టలీగా కంగ్రాచులేట్ చెయ్యడానికి సిద్ధంగా వుండండి."

ప్రతి మనిషిలోనూ హృదయపు లోతులలో సున్నితమైన భావాలు చోటు చేసుకుని వుంటాయి. కావలసినవాళ్ల అచ్చమైన ప్రేమ, అభిమానం, గౌరవం మొదలయిన గుణాలతో ఆ హృదయాంత రాళాన్ని స్పందింపజేస్తే — ఆ వ్యక్తి ద్వారా మనకు కావలసిన పనులు నెరవేర్చుకోవచ్చు. అప్పాగారిలో సౌందర్యకి అలాటి 'సాఫ్ట్ కార్నర్' వుంది. తను ఒత్తిడిచేస్తే ఆయన అంగీకరిస్తారని ఆమెకి దృఢమైన నమ్మకం. ఆ నమ్మకంతో ఆమె వ్యవహార రంగంలో ప్రవేశించబోతున్నది.

## 2

ధనవంతులు తమ ఆస్తులకి తాము ధర్మకర్తలుగా వ్యవహరించి, ప్రజాహిత కార్యాలకోసం, తమ సంపాదన వెచ్చించాలన్న ఆదర్శాన్ని పాటిస్తున్న వ్యక్తి రామ్మూర్తిగారు. సామాన్య కుటుంబంలో పుట్టి స్వశక్తిమీద పైకి వచ్చేడాయన. ఆయన తనకి వుంచుకున్నది వొక పెంకుటిల్లు మాత్రమే. రెండు బస్సులు, ఒక చిట్‌ఫండ్ కంపెనీ, మామిడి తోటలమీద ఆదాయం — ఈ సంపాదనలో చాలా భాగం బీద విద్యార్థుల ఆర్థిక సహాయానికి, తదితర సత్కార్యాలకీ వినియోగిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలతో చాలా ఏళ్లుగా మా వూరు పురపాలక సంఘానికి ఆయన ఉపాధ్యక్షులుగా పోటీ లేకుండా ఎన్నుకోబడుతున్నారు.

స్వాతంత్ర్యం రాకముందు, జిల్లా స్థాయిలో కాంగ్రెసు మీటింగ్ జరిగినప్పుడు ఆ మీటింగు జరగకుండా చెయ్యడానికి జస్టిస్ పార్టీ ప్రముఖులు ఎన్నో అవరోధాలు కలిగించేరట. వీటన్నిటికీ ఎదురు నిలిచి కాంగ్రెసు కార్యకర్తల సమావేశం కోసం, భోజన వసతి సదుపాయాల కోసం, ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి, ఆ మీటింగు దిగ్విజయంగా ఆయన నిర్వహించిన తీరు; వయస్సు మళ్లినవాళ్లు ఈ నాటికీ కథలుగా చెబుతూ వుంటారు. ఆయన నిగర్వి. నిరాడంబరజీవి. పరోపకార పరాయణుడు, వ్యసనాలకి లొంగనివాడు, విద్యాధికుడు కాకపోయినా మంచి సంస్కారం గల వ్యక్తి...

లాయర్లు, డాక్టర్లు, కాలేజీ లెక్చరర్లు, ఉన్నతోద్యోగులు, ప్రముఖ వాణిజ్యవేత్తలు ప్రకాశం జూబ్లీ క్లబ్‌లో సభ్యులు. వెంకటేశ్వరరావుగారు క్లబ్బు సెక్రటరీ. ఆయన వచ్చి వెళ్లిన మర్నాడు ఉదయాన్నే నేనూ, సౌందర్యా రామ్మూర్తిగారింటికి బయల్దేరాం.

"రండి రండి, చిట్టితల్లి కూడా బయల్దేరి వచ్చిందంటే ఏదో దండయాత్ర వుందన్న మాటే" నవ్వుతూ ఆహ్వానించేరు రామ్మూర్తిగారు. నేనూ సౌందర్యా లోపలికి వెళ్లేం. రామ్మూర్తిగారి కోసం వచ్చినవాళ్లు సెలవు తీసుకుని వెళ్లిపోయారు.

"అజాత శత్రువుల మీదికి దండయాత్ర చేసి ఏం ప్రయోజనం? అగ్ర తాంబూల మిచ్చి గౌరవిస్తామని ఆహ్వానించడానికి వచ్చేం" ప్రస్తావించింది సౌందర్య.

"శుభం! బర్త్‌డే పార్టీయా?"

"మీ బాబ్జీ చెప్తారు."

"ఏవిటి బాబ్జీ విశేషం? చిట్టితల్లేవైనా అలికిడి..."

ఆమె సిగ్గుపడింది.

"అదేం కాదప్పాగారు! ఇరవైమూణ్ణ మా మేరేజ్ ఏనివర్సరీ. ముందు చెప్పకపోతే మీరు మళ్లీ ఏవైనా ఎంగేజ్‌మెంట్సు ఫిక్స్ చేసుకుంటారని..."

"ఫిక్స్ అయితే మాత్రం, వేళకి రాకపోతే చిట్టితల్లి వూరుకుంటుందా? తప్పకుండా వస్తాను."

"మేం యిద్దరం వచ్చిన పని యిది. నేనింకో పనిమీద వచ్చేను" సౌందర్య ప్రారంభించింది.

"చెప్పమరి"

"చాలా ముఖ్యమైన పని."

"చిట్టితల్లి వచ్చిందంటేనే చాలా ముఖ్యమైన పని. మీ పెళ్లి పండక్కి ముఖ్య అతిథిగా గొప్పవాళ్లెవరినేనా ఆహ్వానించడానికి నేను వెళ్లాలా?"

"మీరే ఛీఫ్ గెస్ట్!"

"మరింకేవిటి?"

"మేమొక మహిళా సమాజం ప్రారంభిస్తున్నాం. ప్రారంభోత్సవం సభకి మీరు అధ్యక్షత వహించాలి"

"గాయత్రీదేవిగారయితే బాగుంటుందని నా ఉద్దేశం."

"మీరే అధ్యక్షత వహించాలి. తప్పదు. తర్వాత ఒక చిన్న సన్మానం వుంటుంది. సన్మానమంటే—"

"శాలువా కప్పుతారు. పర్సు ప్రజెంట్ చేస్తారు."

"మావయ్యగారి అంచనా తప్పు. అవన్నీ మామూలివి. మా కార్యక్రమంలో అన్నీ కొత్త కొత్త ఐటమ్స్ వుంటాయి."

"పాతకాలపు వాళ్లం. మాకవన్నీ ఎట్లా తెలుస్తాయి? నువ్వు చెప్తే తెలుసుకుంటాం."

"ఒట్టి తెలుసుకోడం కాదు, మా కార్యక్రమానికి మీ ఆమోద ముద్ర కావాలి. ఈ సమాజానికి నేను కన్వీనర్ని. ఓ కమిటీ ఫారమయేదాకా అన్నీ నేనే. అంచేత నేను తలపెట్టిన పనులు దిగ్విజయం కావడానికి మీ అండదండలు కావాలి."

"నువ్వింతగా చెప్పాలా అమ్మాయ్! అన్ని విషయాల్లో నా చేతనైనది నేను చేస్తాను"

"అదిగో! నా చేతనైతే — అంటూ రాజకీయం ప్రారంభించేరు. మీకు నచ్చకపోతే, ఆ పని నావల్ల కాదమ్మాయి అని తప్పించుకుందికి."


"మీ హృదయాల్లో నాకొక గొప్ప స్థానం వుండొచ్చు. కాని నేను సర్వ సమర్థుణ్ణి కాదు కదా?"

"మా మెంబర్సంతా మాలాటివాళ్లే! వాళ్లందరికీ మీరంటే మంచి అభిప్రాయమే. ఆ గౌరవం అభివ్యక్తం చెయ్యడానికే ఈ సన్మానం. సభ్యులందరికీ నేను మాట యిచ్చేను, చిట్టితల్లి మాట మీరు కాదనరనే భరోసాతో! అంచేత మీరు నా మాట నిలబెట్టాలి."

"తప్పకుండా! అంత నమ్మకంతో నువ్వు మాట యిస్తే నీ మాట పొల్లుపోనిస్తానా? ఇంతకీ అదేవిటో చెప్పమరి!"

"మేమంతా మీవాళ్లం. మీ గొప్పదనం సమాజంలో గుర్తింపబడితే మాకందరికీ తృప్తిగా వుంటుంది. అంచేత మీకు విశిష్ట సేవా పతకం

(30వ పేజీ చూడండి)



బహూకరిస్తాం మీరు కాదనకూడదు"

కొంచెంసేపు ఆలోచించి అప్పాగారు సమాధానం చెప్పేరు "సరే! ఒకలా చేదాం మీ పెళ్ళి పండక్కి మనవాళ్ళందరినీ పిలుస్తావుకదా! ఈ పతకం బహూకరణ కూడా అందులోనే చెయ్యి పతకమే యిస్తావో కనకాభిషేకం చేస్తావో — నువ్వేం చేసినా నా కంగీకారమే—ఏమంటావు?"

ఇది అప్పాగారి అలవాటు తనకి యిష్టం కాదని యెదుటివాళ్ళకి చెప్పవలసివస్తే — మరో మార్గం సూచిస్తారు తన ప్రతిపాదన ఆయన అంగీకరించలేదని గ్రహించి, సౌందర్య చిన్నబుచ్చుకుంది

నిశ్శబ్దం తాండవిస్తోంది భారమైన వాతావరణం అలుముకుంది ఆ నిశ్శబ్దాన్ని భరించలేక యింట్లోంచి బయటికి వచ్చి, సిగరెట్టు వెలిగించి, వీధిలో పోయే బళ్ళ మనుషులనీ చూస్తూ నిలబడ్డాను

కొన్ని క్షణాలు గడిచేయి నా వెనకెవరో వచ్చి నిలబడ్డట్టయింది తిరిగిచూస్తే అప్పాగారు! సిగరెట్టు పారేశాను లోపల సౌందర్య ఒక్కతే వుంది ఆమెకి వినబడకుండా మాలో మాకే వినబడేలా గొంతు తగ్గించి ప్రారంభించేరాయన

"ఇరుకున పడ్డాను బాబ్జీ అక్కరలేని బెడద నెత్తిని వేసుకొచ్చిం దమ్మాయి తన పట్టువదలేగాని, నా పరిస్థితి అర్థం చేసుకోకుండా వుంది మొన్న వెంకటేశ్వరరావుగారు కనిపించి ప్రకాశం జూబ్లీ

## అభివ్యక్తం

[23వ పేజీ తరువాయి]

క్లబ్బు తరపున సన్మానం చేదామనుకుంటున్నామని చెప్పేరు నీకు తెలుసుకదా, ఇలాటివాటికి నేను తగనని నా అభిప్రాయం వాళ్ళ నెలాగో తప్పించుకుంటే, యిప్పు డమ్మాయి మళ్ళీ అదే సమస్య తెచ్చిపెట్టింది వాళ్ళని కాదన్నానని వెంకటేశ్వరరావుగారేమైనా మనసు కష్టపెట్టుకున్నాడా?"

"నో నో నో! అలాటిదేం లేదు స్పోర్టింగ్‌గానే తీసుకున్నారు"

"నీ కెప్పుడు కనిపించే రాయన?"

"నిన్న మధ్యాహ్నం మా యింటి కొచ్చేరు"

"మరి మహిళా సమాజం — యిదంతా యెప్పుడనుకున్నారు?"

"ఇక్కడి కొచ్చేదాకా నాకూ తెలియదు" దాచకుండా చెప్పేను

"సన్మానం విషయం వెంకటేశ్వరరావు నిన్నేమైనా కదిపేరా, సౌందర్య వింటుండగా?"

"నన్ను ట్రై చెయ్యమన్నారు ప్రయత్నిస్తానన్నాను తనొప్పిస్తానని సౌందర్య లీడ్ తీసుకుంది"

"అదన్నమాట సంగతి! సరే నువ్వు లోపలికి పద!"

నేను వెళ్ళి కూచున్న కొంచెంసేపట్లో అప్పాగారు లోపలి కొచ్చేరు సౌందర్య పరాజయం పొందిన షాక్ నుంచి తేరుకోలేదింకా!

"చూడు చిట్టితల్లీ!"

సౌందర్య అప్పాగారివేపు చూసింది, కాని మాటాడలేదు ఆయన చెప్పసాగేరు

"వ్యవహారాలు మీద వేసుకొచ్చేటప్పుడు అలా బిగించుకు కూర్చోకూడదు అన్నీ మనం అనుకున్నట్టే జరగవు మన అభిప్రాయాల విషయంలో పట్టు విడుపూ వుండాలి ఎదుటివాళ్ల అభిప్రాయాలకి కూడా విలువ యివ్వాలి నీతో పంతం పట్టుకు కూచోడం నాకెలా అవుతుంది? అంచేత ఒప్పుకుంటున్నాను" అని కొంచెం ఆగేరాయన

సౌందర్య కళ్ళలో విజయగర్వం, సంబరం!

"ఆఁ అదీ! ఇప్పుడు నిజంగా చిట్టితల్లిలా వున్నావు నీ కోసం — నా కిష్టం లేకపోయినా — ఈ ఒక్కసారికి మాత్రం నే నొప్పుకుంటున్నాను కాని నువ్వు నీ ప్రోగ్రాం మార్చుకోవాలి మరేం లేదు, ఈ మహిళా సమాజం, ప్రారంభోత్సవం యింకా పై వాళ్ళెవరితోనూ అనలేదుగా?"

"ఎంత చనువుంటే మాత్రం మీ కన్సెంట్ లేకుండా ఎలా అంటాను మావయ్యగారూ!"

"అయితే సమాజం సంగతలా వుంచనీ క్కావలసింది నా సన్మానమే కదా? క్లబ్బువాళ్ళు చేస్తున్నారు బాబ్జీ! వెంకటేశ్వరరావుగారికి చెప్పు, నే నొప్పుకున్నాననీ — మొదట కాదన్నందుకు మరోలా అనుకోవద్దనీ! చిట్టితల్లి రాజకీయాల్లోకి అడుగు పెడితే, మనకి ఆట కట్టే"

